[సాహిత్యం, లాలిత్యం కలిసినదే లలితసంగీతం -- రావు బాలసరస్వతీ దేవి]

Vaartha Daily, సోమ వారం, డిసెంబర్ 28, 2009

| | |
|---|---|
|  | **వేదికపై నాటకం రసవత్తరంగా జరుగుతోంది. ఒక ప్రధాన పాత్రధారి రామనాధశాస్త్రిగారు ఆ సందర్భాన పాడవలసిన పాటను ప్రారంభించారు. ఇంతలో ఆహుతుల్లోంచి 4ఏళ్లపాప ఆ పాట నాకునూ వచ్చు నేను పాడతాను అంటూ గట్టిగా అరిచింది. పెద్దలు ఎవ్వరూ చెపినా వినదే! నేనూ పాడతానంటూ మారం చేసింది. చివరికి రామనాధశాస్త్రిగారు ముచ్చటపడి ఆ పాపను స్టేజిపైకి పిలిచి ఆ పాటను ఆమెచేతే పాడించారు. ప్రేక్షకులంతా కరతాళధ్వనులు చేశారు. అభినందనలు అందించారు. ఆశీర్వదించారు.** |

**మరో రెండేళ్లకే ఆ అమ్మాయి ఒకేసారి 2సోలో రికార్డులు పాడిన పిన్న వయస్కురాలిగా రికార్డు నమోదు చేసింది. ఇదంతా 1934నాటి మాట. ఆ అమ్మాయి సంగీతవనంలో మొదటిసారిగా 'లలిత సంగీతమనే పుష్పాన్ని పూయించిన తోటమాలి. ఇప్పుడు ఆ స్వరకేళికి 80ఏండ్లు. కానీ రావు బాలసరస్వతీదేవి పేరు దక్కిన ఖ్యాతి నిలిచేను వెయ్యేళ్లు.**

ఆ తోటలోనొకటి ఆరాధనాలయము

ఆ ఆలయములోని అందగాడెవరే,

అందగాడెవరే, అందగాడెవరే!

మన్మధుడనీ చెలియా

మనసు ఘోషించేసే

మరలీ వచ్చెదమన్నా మరపూ రాకున్నాడే

చంద్రబింబపు ముఖమూ

గండుకోకిల స్వరమూ

పండూ వెన్నెలలోనే

పవ్వాళించేనమ్మా...చెలియా

చుక్కల్లా రేడమ్మా ...సఖియా
మాయాదేవీ సుతునని మధురామూర్తీ పలికె
సిద్ధార్థుడే నాకు సిద్ధించెనే, చెలియా!
మది కోర్కె నెరవేరె, సఖియా!
ఆ తోటలో నొకటి ఆరాధనాలయము
ఆ ఆలయములోని అందగాడితడే...
(ఈ పాట రచయిత 'సాలూరి సన్యాసిరాజు)

**బాల్యంలో తండ్రి ప్రభావం**

రావు బాలసరస్వతీదేవి పుట్టింది ఆగస్టు28, 1928 గుంటూరులో. చిన్నప్పటి నుంచే పాటలు ఆసక్తిగా వినడం, పాడటం, ఇతరుల గాత్రాలను అనుకరించడం చేస్తుండేవారు. ఇలా సంగీతాసక్తి మొదలై, మరింత బలపడటానికి కారణం ఆమె తండ్రిగారే. హెచ్ఎమ్వి కంపెనీకి రికార్డింగ్ చేసే కొప్పరపు సుబ్బారావు తన తండ్రికి మిత్రులు. ఆ కాలంలో అన్నీ గ్రామఫోన్ రికార్డులే. స్థానం నరసింహారావు, కపిలవాయి రామనాథశాస్త్రి వంటి మహామహుల నాటకాలను చూసే అవకాశం బాల్యం నుంచే ఆమెకు లభించింది. గుంటూరులో వారి స్వంత థియేటర్ రత్నాహాల్‌లో తరచుగా నాటకాలు జరుగుతుండేవి. తండ్రి వెంట ఆ నాట కాలకు వెళ్లే అలవాటున్న బాలసరస్వతికి కర్నాటక సంగీతంలో అప్పటి పాటలు కంఠశోషలా అనిపించేవట.

**చిత్రరంగ ప్రవేశం**

1934లో అంటే ఆరేళ్ల చిరుప్రాయంలో ఆమె సోలో రికార్డులు రెండు పాడారు. వెంటనే మరు సటి ఏడాది ఆమెకు వెండి తెరపై బాలనటిగా అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. 13ఏళ్లలోపు పిల్లలతో సి.పుల్లయ్య తీసిన 'సతీ అనసూయలో ఆమెకి అవకాశం లభించింది. ఆ చిత్రానికి ఆకుల నరసింహరావు సంగీత దర్శకత్వం వహించారు. బాల నటీనటులతో తయారైన ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించి ఆమెకు గుర్తింపును తెచ్చిపెట్టింది.

తదుపరి తమిళ దర్శకులు కె.సుబ్రమణ్యం తీసిన 'భక్తకుచేల సినిమాలో కృష్ణుడి పాత్ర, కుచేలుడి పాత్ర రెండూ చిన్నారి బాలసరస్వతి వేశారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా పేరురావడం, అవకాశాలు ఒకదాని వెంట ఒకటి వస్తుండటంతో సరస్వతి కుటుంబం మద్రాసుకి మారారు. తర్వాత 'బాలయోగిని సినిమాలో ప్రధానపాత్ర పోషించి ప్రశంసలనం దుకున్నారు సరస్వతి. నాటి కాలంలో పాత్ర ధారులు తమ పాత్రకు

తామే పాటలు పాడు కునేవారు. మద్రాస్ వచ్చిన తరువాత శ్రీఆలత్తూర్ సుబ్బయ్యగారి దగ్గర కర్నాటక సంగీతం నేర్చు కోవడం కేవలం ఒక పునాది కోసమే.ఆమెప్పుడూ సంప్రదాయ సంగీతాన్ని అనుసరించలేదు.

**సాలూరి సారథ్యంలో**

1940లో మద్రాస్ ఆలిండియా, రేడియో ప్రారంభం అయ్యింది. అదే సమయంలో వి.రాజ రాజేశ్వరరావు సంగీత దర్శకత్వంలో 'ఇల్లాలు సినిమా ప్రారంభం అయ్యింది. ఆ సినిమా సంద ర్భంలోనే బాలసరస్వతికి, రాజేశ్వరరావుతో పరిచయం అయ్యింది. ఆ సినిమాలో మూడు డ్యుయెట్లను వాళ్లిద్దరే కలిసి పాడారు. ఆ తరువాత ఈ జంట ఎన్నో పాటలకు తమ గళాన్ని ఒక్కటి చేసి వినిపించింది.

**లలిత సంగీత ప్రస్థానం**

దీని తరువాత ఆలిండియా రేడియో వారు సంప్రదాయరీతులకు అత్యాధునిక సంగీతానికి నడుమ శ్రావ్యమైన లలిత సంగీతాన్ని ప్రాచుర్యం లోకి తెచ్చేందుకు నడుం కట్టారు. లలిత సంగీ తంలో పాడమంటూ మొదటిసారి 'బాల సర స్వతికే అవకాశం ఇచ్చారు. అప్పటి నుంచీ రాజేశ్వరరావు కంపోజింగ్, బాలసరస్వతిగానం 'లలిత సంగీతానికి లాలిత్యాన్ని తెచ్చాయి.



12ఏళ్ల వయసులోనే ఆలిండియా రేడియోలో పాపులర్ గాయినిగా పేరొందారు. ఆ తరువాత ఎన్నో సినిమాల్లో తన గాత్రంతో సంగీతాభిమానుల మనసుల దోచుకున్న బాల సరస్వతి 1958నించీ పాడటం మాను కున్నారు. వివాహం, భర్త, పిల్లలు కుటుంబ బాధ్యతలు ఇవేవీ తను సంగీత జీవితం నుండి వైదొలగడానికి కారణం కాదన్నారామె. మోసపూరిత వాతావరణం కళాకారుల జీవితాలపై చూపే ప్రభావాన్ని చూసి పాడటం నుంచి తప్పుకున్నానని అన్నారు. 1974లో తన జీవిత భాగస్వామి దూరమై, ఒంటరిగా జీవన పోరాటానికి సిద్ధపడి, బెంగుళూరు వెళ్లి స్థిరపడ్డారు.

ఎన్టిరామారావు కోరిక మేరకు తెలుగురాష్ట్రం ఏర్పడ్డాక తెలుగువాళ్లమంతా ఆంధ్రరాష్ట్రంలోనే ఉండాలి అన్న ఆయన మాటను గౌరవించి 17ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు బాలసరస్వతీదేవి.ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. ఎన్నో తరాలను చూశారు. తన అనుభవాలను పంచారు. ఓ కళా కారిణిగా తనకు గుర్తింపు లభించలేదనో, అవార్డులు వరించలేదనో ఏనాడూ వగచింది లేదు. కానీ ఇటీవల లలిత సంగీతానికి ఆద్యులుగా నూతన సంగీత దర్శకులను పేర్కోవడం ఆమెను బాధించింది. ఇది కళాచౌర్యంలో భాగమేనని ఆమె వాపోయారు. అసలైన ఆద్యులను, గురువులను గుర్తించకున్నా ఫరవాలేదు కానీ వారిని కించపరిచే విధంగా మరొకరిని కీర్తికి బాధ్యులను చేయడం దురదృష్టకరం అని తన బాధను వివరించారు.

నేటితరం సంగీతం గురించి తన అభిప్రాయాన్ని చెబుతూపాటకు భావం ముఖ్యం. అర్థవంతంగా, అర్థం చేసుకుంటూ పాడటం ముఖ్యం అన్నారు. లాలిత్యం, సాహిత్యం ప్రాణంగా ఉన్నదే లలిత సంగీతం అని నిర్వచించారు. ఇప్పుడు చిన్నారులు వాటిపై ఆసక్తి చూపడం శుభపరిణామం అని ముగించారు రావు బాలసరస్వతీదేవి.

--- దీప్తిశ్రీ కవులూరు